


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 24-09-2025 | సంపుటి - 24 | సంచిక -133 | రూ : 4 | పేజీలు: 8


## ప్రజల సొమ్ముతో పండుగ కానుకలు వద్దు

### కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఆదేశాలు

- దీపావళి సందర్భంగా ఆర్థిక శాఖ నిర్ణయం
- మంత్రిత్వ శాఖలకు తాజాగా ఆదేశాల జారీ
- ఆర్థిక క్రమశిక్షణ కోసమే నిర్ణయమని వెల్లడి




2లో

## రూ.3,745 కోట్ల పెట్టుబడి... 1,518 మందికి ఉపాధి



2లో



# వేల ఏళ్లు నిలిచేలా గద్దెల అభివృద్ధి

- రాతితో సమ్మక్క-సారలమ్మల ప్రాంగణ పునర్నిర్మాణానికి ప్రణాళికలు
- మేడారం సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- నమూనాను ఆవిష్కరించిన సీఎం



తాడ్వాయి: 'మేడారం అభివృద్ధి కేవలం బాధ్యత కాదు.. భావోద్వేగంతో కూడిన అంశం. పద్దెనిమిదేళ్లుగా సమ్మక్క సారలమ్మలను దర్శించుకుంటున్నా. తెలంగాణకు పట్టిన చీడపీడలను వదిలించేందుకు 2023 ఫిబ్రవరిలో ఇక్కడి నుంచే పాదయాత్ర మొదలుపెట్టా. నాడు గద్దెల వద్ద ప్రణమిల్లి.. దొరలపాలన పారదోలి ప్రజాపాలన తెస్తానని చెప్పా. సంకల్పబలంతో చేపట్టిన ఏ కార్యమైనా విజయవంతమవుతుంది.. ఇప్పుడు మీ కళ్ల ముందు.. పేదల ప్రభుత్వం ఉంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం

తరువాయి 2లో




2లో

## 'వాహన' రిజిస్ట్రేషన్ల జాతర

- జీఎస్టీ తగ్గింపుతో కొనుగోళ్ల జోరు

హైదరాబాద్: వాహనాలపై జీఎస్టీ తగ్గించడంతో ఆటోమొబైల్ పరిశ్రమతో పాటు రవాణాశాఖలో ఉత్సాహం నెలకొంది. తగ్గిన జీఎస్టీ రేట్లు సోమవారం నుంచి అమల్లోకి రావడంతో కొత్త వాహనాల కొనుగోలుదారులతో వాహన షోరూంలు సందడిగా మారాయి. 22న ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,126 కొత్త వాహనాల కొనుగోళ్లు, తాత్కాలిక రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడు సరిగ్గా ఇదే రోజున జరిగిన వాహన కొనుగోళ్ల సంఖ్య 286

తరువాయి 2లో

## ఢిల్లీలో వేడుకగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

- ఉత్తమ నటులుగా అవార్డు అందుకున్న షారుఖ్, విక్రాంత్
- మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల ప్రదానం

2లో





## జర్మనీకి భారత పర్యాటకుల వెల్లువ..

### యూరప్‌లోనే టాప్3 డెస్టినేషన్!

2లో



## అమెరికాకు గుడ్ బై చెప్పండి...

### భారతీయ నిపుణులకు బెటర్ వర్క్ వీసాలు ఆఫర్ చేస్తున్న ఐదు దేశాలు

## తిరుమల శ్రీవారికి విలువైన కానుక సమర్పించిన తెలంగాణ ఎంపీ



2లో

- శ్రీవారికి రూ.60 లక్షల విలువైన స్వర్ణాభరణం సమర్పణ
- 535 గ్రాముల బరువున్న స్వర్ణాభరణం
- రంగనాయకుల మండపంలో ఆభరణాన్ని స్వీకరించిన అధికారులు
- వివరాలు వెల్లడించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

## కులగణన తేల్చాకే స్థానిక పోల్స్..

2లో



# ఢిల్లీలో వేడుకగా జాతీయ అవార్డుల ప్రదానోత్సవం

**ఢిల్లీ, సెప్టెంబర్ 23 :** భారతీయ సినీ రంగంలో అత్యంత విశిష్టంగా భావించే 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అట్టహాసంగా జరిగింది. 2023 సంవత్సరానికి గాను భారతీయ సినిమాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ ఏడాది ఉత్తమ నటుడి పురస్కారాన్ని బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్, విలక్షణ నటుడు విక్రాంత్ మస్సే సంయుక్తంగా గెలుచుకున్నారు. పాన్‌ఇండియా చిత్రం 'జవాన్'లో అద్భుత నటనకు షారుఖ్ ఖాన్‌కు, '12th ఫెయిల్' చిత్రంలో అసాధారణ నటనకు విక్రాంత్ మస్సేకు రజత కమలం లభించింది. విశేషమేమిటంటే, వీరిద్దరికీ ఇదే తొలి జాతీయ అవార్డు కావడం గమనార్హం. మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ కెరీర్‌లో షారుఖ్ ఖాన్ జాతీయ అవార్డు అందుకోవడం ఇదే మొదటిసారి. భారతదేశంలో 'కింగ్ ఆఫ్ బాలీవుడ్'గా పేరుగాంచిన షారుఖ్, 80కి పైగా చిత్రాలలో నటించి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన ఇప్పటికే పద్మశ్రీ, ఫ్రాన్స్‌కు చెందిన చెవాలియర్ డి లా లెజియన్ డి'హొన్నూర్ వంటి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. ఇక విక్రాంత్ మస్సే సైతం టీవీ రంగం నుంచి వచ్చి 'ఏ డెత్ ఇన్ ది గంజ్', 'ఛపాక్', 'మీర్జాపూర్' వంటి వెబ్ సిరీస్‌లతో తన నటనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ వేడుకలో భారతీయ సినిమాకు చేసిన సేవలకు గాను, మలయాళ సినీ దిగ్గజం మోహన్‌లాల్‌కు దేశంలోనే అత్యున్నత సినీ పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా మలయాళ చిత్ర పరిశ్రమలో తన అద్భుత నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న మోహన్‌లాల్‌ను కేరళలో అభిమానులు 'లాలెట్టన్' అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. ఆయన 350కి పైగా చిత్రాలలో నటించి, ఐదు జాతీయ అవార్డులతో పాటు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆయన కెరీర్‌లో 'రాజావింటే మకన్', 'కిరీడం', 'భారతం', 'వానప్రస్థం' వంటి ఎన్నో క్లాసిక్ చిత్రాలు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఫీచర్ ఫిల్మ్ కేటగిరీ జ్యూరీ చైర్మన్, ప్రముఖ దర్శకనిర్మాత అశుతోష్ గోవారికర్, రచయిత గోపాలకృష్ణ పాయ్, దర్శకుడు పి. శేషాద్రి వంటి ప్రముఖులు హాజరయ్యారు. 2023 సంవత్సరానికి సంబంధించిన ఈ అవార్డులను ఆగస్టు 1, 2025న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే.

## తిరుమల శ్రీవారికి విలువైన కానుక సమర్పించిన తెలంగాణ ఎంపీ

**తిరుమల, సెప్టెంబర్ 23 :** కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారికి తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం నాడు భారీ విరాళం సమర్పించారు. సుమారు రూ.60 లక్షల విలువైన అత్యంత అపురూపమైన స్వర్ణాభరణాన్ని ఆయన స్వామివారికి కానుకగా అందించారు. ఈ విషయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి 535 గ్రాముల బరువున్న "అష్టలక్ష్మి చంద్రవంక కంఠి" అనే స్వర్ణ కంఠాభరణాన్ని శ్రీవారికి సమర్పించినట్లు ఆయన తెలిపారు. తిరుమలలోని రంగనాయకుల మండపంలో జరిగిన ఒక కార్యక్రమంలో, టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి తాము ఈ విరాళాన్ని స్వీకరించినట్లు ఛైర్మన్ పేర్కొన్నారు.

## జర్మనీకి భారత పర్యాటకుల వెల్లువ.. యూరప్‌లోనే టాప్-3 డెస్టినేషన్!

**ఢిల్లీ, సెప్టెంబర్ 23 :** యూరప్‌లో విహారయాత్రలకు వెళ్లే భారతీయులకు జర్మనీ అత్యంత ఇష్టమైన దేశంగా మారుతోంది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లోనే భారత పర్యాటకులు జర్మనీలో 5,20,000 మంది బస చేశారని జర్మన్ నేషనల్ టూరిస్ట్ ఆఫీస్ (జీఎన్‌టీవో, ఇండియా) మంగళవారం వెల్లడించింది. ఈ గణాంకాలతో యూరప్‌లో భారతీయులు ఎక్కువగా సందర్శించే టాప్ 3 దేశాల్లో ఒకటిగా జర్మనీ నిలిచింది. గతేడాది (2024) ఇదే సమయంతో పోలిస్తే ఈ ఏడాది జనవరి జూలై మధ్య జర్మనీకి వచ్చే భారత పర్యాటకుల సంఖ్య 5.5 శాతం పెరిగింది. ముఖ్యంగా భారత్ జర్మనీ మధ్య విమాన సర్వీసులు గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. 2019తో పోలిస్తే 2024 నాటికి ఇరు దేశాల మధ్య విమానాల రాకపోకలు 26 శాతం అధికమయ్యాయి. మెరుగైన కనెక్టివిటీతో పాటు, ఆధునిక భారత పర్యాటకులను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా సత్ఫలితాలనిచ్చాయని జీఎన్‌టీవో తెలిపింది. ఈ పరిణామంపై జీఎన్‌టీవో ఇండియా మార్కెటింగ్ అండ్ సేల్స్ డైరెక్టర్ రోమిత్ థియోఫిలస్ మాట్లాడుతూ, "జర్మనీ టూరిజంకు భారత మార్కెట్ అత్యంత కీలకం. ఏటా నమోదవుతున్న వృద్ధి మాకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తోంది. జర్మనీలోని చారిత్రక నగరాలు, ప్రకృతి సౌందర్యం, ప్రత్యేక సంస్కృతి భారతీయులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయని ఇది స్పష్టం చేస్తోంది" అని వివరించారు. భారత పర్యాటకుల వల్ల జర్మనీ ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ ప్రయోజనం చేకూరుతోంది. 2024లో భారత పర్యాటకుల ద్వారా జర్మనీకి ఏకంగా 1.1 బిలియన్ యూరోల (దాదాపు రూ. 10 వేల కోట్లు) ఆదాయం సమకూరింది. జర్మనీకి వెళ్లే ప్రతి భారత పర్యాటకుడు సగటున ఒక ట్రిప్పులో 3,068 యూరోలు ఖర్చు చేస్తున్నాడని అంచనా. ఈ నేపథ్యంలో, భారత మార్కెట్‌పై మరింత దృష్టి సారించేందుకు జీఎన్‌టీవో సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, ప్రముఖ భారత సెలబ్రిటీలతో జర్మనీలోని అంతగా ప్రాచుర్యం లేని పర్యాటక ప్రాంతాలను చూపిస్తూ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను రూపొందించనున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు.

## కులగణన తేల్చాకే స్థానిక పోల్స్.. తెలంగాణ ప్రభుత్వానికి కవిత డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కీలక ఆరోపణలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలను ప్రకటించడానికి ముందే, రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే వివరాలను ప్రతి గ్రామ పంచాయతీ వారీగా బయటపెట్టాలని ఆమె మంగళవారం డిమాండ్ చేశారు. కులగణన సర్వే వివరాలను రహస్యంగా ఉంచి, బీసీ రిజర్వేషన్లను తమకు అనుకూలంగా ఖరారు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆమె ఒక పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలమైన ప్రాంతాల్లో రిజర్వేషన్లు ఖరారు చేసుకునేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆమె విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం హడావుడిగా ఎన్నికలు నిర్వహిస్తే బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కవిత హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల తేదీలను ప్రకటించేలోపే కులగణన వివరాలను బహిర్గతం చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆమె అన్నారు. "బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు తెలంగాణ జాగృతి మొదటి నుంచి చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రిజర్వేషన్లు పెరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని కవిత తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న కారణంతో బీఆర్ఎస్ అధినేత, ఆమె తండ్రి కేసీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత కవిత, తెలంగాణ జాగృతి కార్యక్రమాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. కాగా, ఆమె మంగళవారం మంచిర్యాల జిల్లాలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కూడా ఆమె పాల్గొన్నారు.

## ప్రజల సొమ్ముతో పండుగ కానుకలు వద్దు.. కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23:** దీపావళి పండుగ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ కీలక ఉత్తర్వులు వెలువరించింది. పండుగ సంతోషాన్ని పంచుకునేందుకు ప్రజల సొమ్ము వెచ్చించవద్దని ఆదేశించింది. ఇతర పండుగల సమయాల్లోనూ కానుకల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేయొద్దని మంత్రిత్వ శాఖలకు స్పష్టం చేసింది. ఆర్థిక క్రమశిక్షణకు, అనవసర వ్యయాలను నివారించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొంది. ప్రజావనరులను మరింత సమర్థవంతంగా వినియోగించేలా ప్రభుత్వ విభాగాలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఇందులో భాగంగానే తాజాగా ఈ నోటీసులు పంపింది. ఆర్థిక క్రమశిక్షణను ప్రోత్సహించడం, అనవసర ఖర్చులను నియంత్రించడంపై ఆర్థిక శాఖ వ్యయ విభాగం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే దీపావళి సహా ఇతర పండగలకు బహుమతుల కోసం మంత్రిత్వ శాఖలు ఎలాంటి ఖర్చు చేయరాదని నోటీసుల్లో పేర్కొంది.

## రైల్వే సరికొత్త సిగ్నలింగ్ వ్యవస్థ.. తగ్గనున్న ప్రమాదాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23:** దేశవ్యాప్తంగా రోజూ లక్షలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తోన్న రైల్వేశాఖ చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ పాత విధానంలోనే సిగ్నలింగ్ వ్యవస్థను అమలు చేస్తోంది. దీని వల్ల ఓ ట్రాక్‌పై ఓ రైలు స్టేషన్ నుంచి బయలు దేరి తర్వాతి స్టేషన్‌ను దాటే వరకు ఆ మార్గంలో మరో రైలును అనుమతించరు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతుంటారు. ఈ విధంగా రైలు ప్రయాణాల్లో ఆలస్యాన్ని నివారించడానికి రైల్వేశాఖ సరికొత్త ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది. దీనిపై రైల్వే అధికారి నవీన్ కుమార్ మాట్లాడుతూ..కొత్త సిగ్నలింగ్ వ్యవస్థలో ఒక స్టేషన్ నుంచి మరొక స్టేషన్‌కు క్రమం తప్పకుండా సిగ్నల్స్ చేరుతాయన్నారు. దీని వల్ల ఒక రైలు సిగ్నల్‌ను దాటగానే.. మరో రైలు సిగ్నల్‌ను అందుకొని ట్రాక్‌పైకి వస్తుందన్నారు. గతంలో మొదటి రైలు బ్లాక్ సెక్షన్‌ను దాటే వరకు మరొక రైలును అనుమతించే అవకాశం ఉండేది కాదన్నారు. కొత్త వ్యవవస్థతో తక్కువ సమయంలో ప్రయాణికులకు ఎక్కువ రైళ్లను అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. ఆటోమేటిక్ వ్యవస్థ వల్ల రైలు ప్రమాదాలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. ఇటీవల ప్రయోగపూర్వకంగా తూర్పు కోస్ట్ రైల్వే తాల్చేర్‌పరదీప్ ఫ్రైట్ కారిడార్‌లోని కటక్‌పరదీప్ ప్రాంతాల మధ్య ఈ అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించింది.

## అమెరికాకు గుడ్ బై చెప్పండి... భారతీయ నిపుణులకు బెటర్ వర్క్ వీసాలు ఆఫర్ చేస్తున్న ఐదు దేశాలు

**అమెరిక, సెప్టెంబర్ 23 :** అమెరికాలో ఉద్యోగం సాధించి స్థిరపడాలనే ఎందరో భారతీయ నిపుణుల ఆశలకు ట్రంప్ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త నిబంధన గట్టి దెబ్బ కొట్టింది. హెచ్1బీ వీసా కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ఏకంగా లక్ష డాలర్లు (సుమారు 88 లక్షల రూపాయలు) ఫీజుగా చెల్లించాలన్న నిబంధన ఇప్పుడు పెను సవాలుగా మారింది. దీంతో అమెరికాలో ఉద్యోగం అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారడంతో, నైపుణ్యం కలిగిన భారతీయులు ఇతర దేశాల వైపు చూస్తున్నారు. మెరుగైన అవకాశాలు, సులభమైన వీసా నిబంధనలు అందిస్తున్న పలు దేశాలు వారికి ఆశాకిరణంగా కనిపిస్తున్నాయి.

**కెనడా, జర్మనీలలో విస్తృత అవకాశాలు:**

ప్రస్తుతం భారతీయ నిపుణులకు అత్యంత ఆకర్షణీయమైన దేశంగా కెనడా నిలుస్తోంది. అక్కడి ఫెడరల్ స్కిల్డ్ వర్కర్ ప్రోగ్రామ్ (FSWP) ద్వారా విదేశీ నిపుణులు సులభంగా వర్క్ వీసా పొందవచ్చు. ముఖ్యంగా ఐటీ రంగంలో విస్తృత అవకాశాలు ఉండటం, శాశ్వత నివాసం (పీఆర్) ప్రక్రియ కూడా సులభతరం కావడంతో చాలామంది కెనడాను ఎంచుకుంటున్నారు. యూరప్‌లో ఆర్థికశక్తిగా పేరొందిన జర్మనీ కూడా నిపుణులకు మంచి గమ్యస్థానంగా ఉంది. ముఖ్యంగా తయారీ, ఇంజినీరింగ్ రంగాల్లో ఇక్కడ ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయి. జాబ్ సీకర్ వీసాతో ఆరు నెలల పాటు అక్కడే ఉండి ఉద్యోగం వెతుక్కునే సౌలభ్యం ఉంది. ఉద్యోగం లభించగానే దాన్ని వర్క్ పర్మిట్‌గా మార్చుకోవచ్చు. యూరోపియన్ యూనియన్ బ్లూ కార్డ్ ప్రోగ్రామ్ కూడా జర్మనీలో పనిచేయడానికి మార్గం సుగమం చేస్తోంది.

## రూ.3,745 కోట్ల పెట్టుబడి... 1,518 మందికి ఉపాధి

* **మూడు కంపెనీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం**

హైదరాబాద్: రాష్ట్రంలో రూ.3,745 కోట్ల పెట్టుబడులు పెట్టి 1,518 మంది యువతకు ఉపాధి కల్పించడానికి ముందుకొచ్చిన మూడు కంపెనీలకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. మంగళవారం సచివాలయంలో పారిశ్రామిక ప్రోత్సాహకాల మంత్రివర్గ ఉపసంఘం సమావేశం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఇందులో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ...''పండ్లతోటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించే పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు పెద్దఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయి. జేఎస్‌డబ్ల్యూ యూపీవీ లిమిటెడ్ మహేశ్వరంలో రూ.785 కోట్ల పెట్టుబడితో 364 మందికి ఉపాధి కల్పించేలా కొత్త యూనిట్ ప్రారంభించడానికి ముందుకొచ్చింది. తోషిబా కంపెనీ రూ.562 కోట్ల పెట్టుబడితో 554 మందికి ఉపాధి కల్పించడానికి ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్‌గేర్, బుషింగ్స్ పరిశ్రమను ఏర్పాటు చేయనుంది. హిందుస్థాన్ కోకా కోలా బెవరేజెస్ కంపెనీ రూ.2,398 కోట్ల పెట్టుబడితో 600 మందికి ఉపాధి కల్పించేలా పరిశ్రమను నెలకొల్పుతుంది. ఈ మూడింటికి ఉపసంఘం ఆమోదం తెలిపింది. కోకా కోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ పంటలకు డిమాండ్ ఏర్పడి రాష్ట్ర రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుంది'' అని చెప్పారు. వివిధ దేశాల నుంచి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన కంపెనీలు.. ఒప్పందాలు, విధి విధానాలపై మంత్రులు సమీక్షించారు.

## వేల ఏళ్లు నిలిచేలా గద్దెల అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)



ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం పర్యటనలో భాగంగా ఆయన తొలుత వనదేవతల గద్దెలను దర్శించుకొని.. నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. అనంతరం అధికారులు, పూజారులు, ఆదివాసీ సంఘాల వారితో సమావేశమయ్యారు.

**వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలి**

అనంతరం జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి సమ్మక్కసారలమ్మ గద్దెల అభివృద్ధి, ప్రాంగణ పునర్నిర్మాణానికి సంబంధించిన నమూనాను ఎలక్ట్రానిక్ తెరపై ఆవిష్కరించారు. కోట్ల మంది భక్తులచే పూజలందుకుంటున్న ఈ వన దేవతల క్షేత్రం కీర్తి వేల ఏళ్లు నిలిచేలా సమ్మక్కసారలమ్మ గద్దెలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇటుకలతో కట్టే నిర్మాణాలు వందేళ్లకు మించి ఉండవని.. రాతితో కట్టినవే చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయన్నారు. ఇందుకు రుద్రదేవుడు కట్టించిన రామప్ప ఆలయమే నిదర్శనమన్నారు. తనకు, సీతక్కకు పునర్నిర్మాణంలో భాగమయ్యే అవకాశం దక్కినందుకు తమ జీవితాలు ధన్యమయ్యాయని చెప్పారు. ఆదివాసీలు, పూజారుల కుటుంబాలను ఈ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నట్లు ప్రకటించారు.

**ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**

ఆదివాసీలు, గిరిజనులు ఈ దేశానికి మూలవాసులని వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ తమ ప్రభుత్వం పథకాలను రూపొందిస్తోందని సీఎం రేవంత్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మిగతా నియోజకవర్గాల మాదిరిగా 3,500 గృహాలు చాలవంటే.. అదనంగా కేటాయించామన్నారు.

## 'వాహన' రిజిస్ట్రేషన్ల జాతర

హైదరాబాద్: వాహనాలపై జీఎస్టీ తగ్గించడంతో ఆటోమొబైల్ పరిశ్రమతో పాటు రవాణాశాఖలో ఉత్సాహం నెలకొంది. తగ్గిన జీఎస్టీ రేట్లు సోమవారం నుంచి అమల్లోకి రావడంతో కొత్త వాహనాల కొనుగోలుదారులతో వాహన షోరూంలు సందడిగా మారాయి. 22న ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 3,126 కొత్త వాహనాల కొనుగోళ్లు, తాత్కాలిక రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడు సరిగ్గా ఇదే రోజున జరిగిన వాహన కొనుగోళ్ల సంఖ్య 286 మాత్రమే. జీఎస్టీ తగ్గింపుతోఅన్నిరకాల వాహనకొనుగోళ్లు దాదాపు 11 రెట్లు పెరిగాయి. ఆదాయం కూడా భారీగా వచ్చింది. సోమవారం రూ.15.04 కోట్ల ఆదాయం రాగా గతేడాది సెప్టెంబరు 22న వచ్చిన ఆదాయం రూ.0.97 కోట్లు మాత్రమే.

**కార్లు భారీగా...**

జీఎస్టీ శ్లాబుల తగ్గింపుతో అన్నిరకాల వాహనాల కొనుగోలులో పన్ను భారం తగ్గింది. ముఖ్యంగా కార్లపై అధిక ప్రభావం ఉంది. గతేడాది సెప్టెంబరు 22తో పోలిస్తే ద్విచక్రవాహనాల అమ్మకాలు, తాత్కాలిక రిజిస్ట్రేషన్లు 7.6 రెట్లు పెరిగాయి. కార్ల పెరుగుదల ఏకంగా 24 రెట్లు ఉండటం గమనార్హం. ఏడాది చివరలో కొంటే అమ్మినప్పుడు మోడల్ ఇయర్ పేరుతో రీసేల్ మార్కెట్‌లో తక్కువ విలువ పలుకుతుంది. అందుకే చాలా మంది 'కొత్త సంవత్సరం, కొత్త వాహనం' అన్నభావనతో జనవరిలో కొంటుంటారు. కానీ ఇప్పుడు జీఎస్టీ తగ్గడంతో భారీ ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దసరా పండగ కూడా కొద్దిరోజుల్లో ఉండటంతో పండక్కి కొత్త వాహనం కొనాలని హుషారుగా షోరూమ్‌లకు వెళుతున్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తికాగానే అక్కడే తాత్కాలిక రిజిస్ట్రేషన్ పూర్తయిపోతుంది.

# మాజీ మంత్రి మాధవరెడ్డి కృషి మరువలేనిది

* **లక్కారం కట్ట మైసమ్మ వద్ద కొబ్బరికాయలు కొట్టిన టిడిపి నాయకులు**
* **టిడిపి మునుగోడు నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నాడు పంచాయతీరాజ్ మంత్రిగా దివంగత ఎలిమినేటి మాధవరెడ్డి లక్కారం కాలువ నిర్మాణంలో చేసిన కృషి మరువలేనిదని టిడిపి మునుగోడు నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం లక్కారం కట్ట మైసమ్మ వద్ద మంగళవారం బడుగు లక్ష్మయ్య టిడిపి నాయకులతో కలిసి మండలంలోని లక్కారం కట్ట మైసమ్మ వద్ద కొబ్బరికాయలు కొట్టి చెరువు నీటికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వలన మల్కాపురం చెరువు ద్వారా ఖైతాపురం చెరువు నిండి అలుగు ద్వారా లక్కారం చెరువులోకి నీళ్లు వస్తున్నాయన్నారు. ఆనాడు టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి పంచాయత్ రాజ్ మంత్రి దివంగత ఎలిమినేటి మాధవరెడ్డి సహకారంతో లక్కారం కాలువ నిర్మాణం జరిగిందని గుర్తు చేశారు. మల్కాపురం తెప్పలచెరువు నుంచి శేషరాశి కుంట, మల్కాపురం, ఖైతాపురం, లక్కారం, చౌటుప్పల్ గ్రామాల చెరువులోకి నీళ్ల మళ్లింపు కోసం నిధులు వెచ్చించి నిర్మాణం చేయించిన ఘనత దివంగత ఎలిమినేటి మాధవరెడ్డిది అన్నారు. నాడు మాధవరెడ్డి చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. ఇక్కడి ప్రజల కల మాధవ రెడ్డితో తీరిందన్నారు. కానీ, కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కాలువకు అడ్డుగా నీళ్లు రాకుండా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు సైతం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. గత 5సంవత్సరాల నుంచి కరువుతో ఉన్న మండల ప్రజలు చెరువులలో జల కళ సంతరించుకోవడంతో, సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు నల్ల పర్వతాలు యాదవ్, మండల పార్టీ అధికార ప్రతినిధి పాశం రఘుపతి ముదిరాజ్, చౌటుప్పల మున్సిపల్ అధ్యక్షుడు సుంకరి జంగయ్య గౌడ్, టిడిపి జిల్లా నాయకుడు యాట వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## వరద నీరు ఇండ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలి

* **అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : వరద నీరు ఇండ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ ఎల్ పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అధికారులను ఆదేశించారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్ పరిధిలోని ఉమామహేశ్వర కాలనీలో కురిసిన అకాల వర్షాలతో వరద నీరు ఇండ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మంగళవారం మున్సిపల్ అధికారులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు కలిసి కాలనీలో పర్యటించారు ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరమైన మాట్లాడుతూ కురిసిన అకాల వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరద నీరు ఉమామహేశ్వర కాలనీ వాసుల ఇండ్లలోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే పక్కన ఉన్న కాలనీ ప్రహరీ గోడ కూలకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శిరీష ప్రవీణ్ రావు, డప్పు కిరణ్, ఫాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు భూ లక్ష్మణ్, అనిల్, ఉమా మహేశ్వర కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక చర్యలు

: **కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాదక ద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది.కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాసంస్థలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో డ్రగ్స్ నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మాదకద్రవ్యాలకు బానిసైన వారికి డీఅడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స అందించాలని సూచించారు. అటవీ భూముల్లో గంజాయి సాగు గుర్తించినప్పుడు పోలీస్ అధికారులు తక్షణ సమాచారం అందించాలి అని తెలిపారు. యువతలో రక్తదానం, ఆరోగ్య చైతన్యం, ఎన్సిసి శిక్షణల ద్వారా మార్గనిర్దేశం కూడా అవసరం అని పేర్కొన్నారు.

## బతుకమ్మ పండుగపై నటి ఖుష్బూ ఆసక్తికర వ్యాఖ్యలు



తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ పండుగ సంబురాల్లోసినీ నటి ఖుష్బూ సుందర్ పాల్గొన్నారు. బీజేపీ మహిళా నేతలతో కలిసి ఆడిపాడారు. ఈ సందర్భంగా కుష్బూ మాట్లాడారు. ముందుగా తెలంగాణ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో బతుకమ్మ పండుగ చాలా ప్రత్యేకమైనదని అన్నారు. ఈ పండుగ వేళ మోడీ జీఎస్టీ తగ్గించి డబుల్ బొనాంజా ఇచ్చారని చెప్పారు. మహిళలు ఆనందంగా పండుగ జరుపుకునేలా చేశారని వెల్లడించారు. జీఎస్టీ తగ్గింపు దేశ ప్రజలకు పండగ లాంటిదని అన్నారు. కాగా, తెలంగాణ సాంప్రదాయంలో బతుకమ్మ పండుగ ప్రత్యేకం. చిన్నా-పెద్దా తేడా లేకుండా స్త్రీలు, పిల్లలు అందరూ బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ, సంతోషంగా ఆడుతూ పాడుతూ వేడుకలు నిర్వహిస్తారు. పచ్చని ప్రకృతి నుంచి వచ్చే రంగు రంగుల పూలతో గౌరమ్మను అలంకరించి, ప్రతిరోజూ ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తూ పూజించడం ఈ పండుగ ప్రధాన ఆకర్షణ. బతుకమ్మ అంటే కేవలం పువ్వులు పేర్చిన గోపురం మాత్రమే కాదు, అది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మీయత, భక్తి, ఆనందాల సమ్మేళనం. సెప్టెంబర్ 21 ఎంగిలి పూల బతుకమ్మతో బతుమ్మ పండుగ వేడుకలు మొదలయ్యాయి.



## ఆయుర్వేద వైద్యులకు ఔషధ మొక్కలు బహుమతిగా అందజేసిన నైనిక రజువా

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆయుర్వేద వైద్య పితామహుడు ధన్వంతరి మహాశయుని జయంతిని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో, మంగళవారం 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్ జి.ఆర్.బస్తి మస్జిద్ రోడ్‌లో మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన ఆయుర్వేద వైద్యులు, సిబ్బందికి మన్ కీ బాత్‌లో ప్రధాని ప్రశంసలందుకున్న మొక్కల రాజశేఖర్ సహకారంతో, ప్రకృతి హరిత దీక్షురాలు నైనిక రజువా ప్రత్యేకంగా ఔషధ మొక్కలు బహుమతిగా అందజేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఈ సందర్భంగా "ప్రకృతిని సంరక్షించడం, ఔషధ మొక్కలను పెంపొందించడం మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది" అని సందేశమిచ్చారు. ప్రతి ఆయుర్వేద వైద్యునికి శుభాకాంక్షలు తెలిపారు, చిన్నారి నైనిక రజువా చేస్తున్న ప్రకృతి సేవా కార్యక్రమాలకి ఆయుర్వేద వైద్యులు, పలువురు అభినందించారు.



## ఉచిత దంత వైద్య శిబిరానికి మంచి స్పందన

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: శ్రీ సాయి అడ్వాన్స్డ్ డెంటల్ కేర్ ఆసుపత్రి ఐదు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా శ్రీ సాయి అడ్వాన్స్డ్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అం బజార్ సెంటర్లో మంగళవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా దంత వైద్యురాలు డాక్టర్ సౌజన్య మాట్లాడుతూ రూట్ కెనాల్, లేజర్ ట్రీట్మెంట్ ,ఇన్ ప్లాంట్స్ ,ఫిక్స్డ్ టీత్ , దవడ ఎముకులకు సంబంధించిన సర్జరీలు తదితర చికిత్సలు అందించబడతాయన్నారు. గత ఐదు సంవత్సరాలుగా ఇల్లందులో విజయవంతంగా డెంటల్ కేర్ నిర్వహిస్తున్నామన్నారు. గత 15 సంవత్సరాలుగా తనకు దంత వైద్య విభాగంలో అనుభవం ఉందని , అనేక పరీక్షలు నిర్వహించి రోగులకు సేవలు అందిస్తూ వస్తున్నామన్నారు. ఫీజు కూడా రోగులకు అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని ఇల్లందు, చుట్టూ పరిసర ప్రాంతాల దంత రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రేయ, లేఖన, డాక్టర్ రవి, హరికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## న్యాయ వాదులకు రక్షణ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే

* **ఇల్లందు బీఆర్ఎస్ వ్యవస్థాపక నాయకులు దిండిగాల రాజేందర్.**

ప్రజాస్ఫూర్తి, ఇల్లందు:కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయ వాదుల రక్షణ కోసం చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు కోర్టు ఆవరణలో చేస్తున్న నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇల్లందు బీఆర్ఎస్ వ్యవస్థాపక నాయకులు దిండిగాల రాజేందర్, ఎస్. రంగనాథ్, టీబీజీకెఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, పట్టణ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్, లలిత్ కుమార్ పాసి లు వెళ్ళి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ న్యాయవాదులు చట్టాన్ని, న్యాయాన్ని కాపాడటానికి నిలబడుతున్నప్పుడు కొన్ని దుష్ట శక్తులు వారిని టార్గెట్ చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారు. న్యాయ వాదులకు రక్షణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అందుకే వారి రక్షణకు చట్టం తేవటం మంచిదేనని బీఆర్ఎస్ పార్టీ వారి న్యాయమైన పోరాటానికి అండగా ఉంటుందని తెలిపారు.

## పేద విద్యార్థులకు గుడ్ న్యూస్.. రూ.30 వేల స్కాలర్‌షిప్ మిస్ చేసుకోకండి!

నైపుణ్యం కలిగిన యువతీ, యువకులు చదువుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం 15 వేల మందికి అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోంది. ఆర్థిక సమస్యల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా విద్యార్థులకు, ఉన్నత విద్యను అభ్యసించడానికి ఈ స్కాలర్‌షిప్ ఎంతగానో తోడ్పడుతుంది. ప్రతీ సంవత్సరం 15 వేల మందికి రూ.30,000 స్కాలర్‌షిప్‌ను అందిస్తోంది. ముఖ్యంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళా విద్యార్థినులకు ఉన్నత విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కోరుతుంది. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు మాత్రమే కాకుండా, సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థినులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలు లేదా కళాశాలల నుండి 10వ, 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. 202526 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ కాలేజ్ లేదా విశ్వవిద్యాలయంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ లేదా ఎంబీబీఎస్ కోర్సు మొదటి సంవత్సరంలో చేరి ఉండాలి. దరఖాస్తుకు ఎలాంటి రుసుము లేకుండా, ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తారు.

## నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం లో గల జి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వ్యక్తిగత కార్యదర్శి సతీష్ కుమార్తె నూతన పట్టు వస్త్రాలంకరణ ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు తోపాటు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాజీ కార్పొరేటర్ సుమన్ నాయక్ పలువురు నాయకులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

## టిపిసిసి అధ్యక్షుని కలిసిన వజ్రష్ యాదవ్



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి: మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధిపై మంగళవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ ని ఆయన నివాసంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధిపై పలు అంశాలు చర్చించారు ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

## చెరువు కలుషితంపై కలెక్టరేట్ ముందు ఆమరణ దీక్ష

* **అరెస్ట్ చేసి పీఎస్ కి తరలింపు**
* **పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



జిన్నారం(గుమ్మడిదల),ప్రజా స్ఫూర్తి 23: సంగారెడ్డి కలెక్టరేట్ ముందు దోమడుగు గ్రామ యువకుడు జ్ఞానేశ్వర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగాడు. గ్రామంలోని నల్లకుంట చెరువును కాపాడి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. స్థానిక హెట్రో డ్రగ్స్ పరిశ్రమతో చెరువు ,గ్రామ రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. చెరువు కలుషితం కావడం వల్ల తాను అమరణ నిరాహార దీక్ష చేస్తున్నానని తెలిపారు. పరిశ్రమను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు అతనిని అరెస్ట్ చేసి సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ కు తరించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మద్ది జైపాల్ రెడ్డి, మంగయ్య, నర్సంపల్లి శ్రీనివాసరెడ్డి, రాజు తదితరులు జ్ఞానేశ్వర్ కలిశారు.

## శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు,చైతన్య విద్యా నికేతన్ విద్యాసంస్థల చైర్మన్, పాఠశాల కరస్పాండెంట్ శివరాత్రి యాదగిరి తో పాటు వివిధ పాఠశాలల కరస్పాండెంట్స్ పాల్గొని ఆయనకు పుష్పగుచ్చం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు .

# మెగా ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: 10వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని కూలీలైన్ జి.ఆర్.బస్తి మస్జిద్ రోడ్‌లో మంగళవారం మెగా ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం మాజీ ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ హాజరై, ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతను వివరించారు. ఆయుర్వేదం ద్వారా ఎన్నో జబ్బులను నయం చేయవచ్చునని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని చెప్పారు. అంతరించిపోతున్న ఆయుర్వేద వైద్యానికి మళ్లీ పునర్జీవం కల్పించాలని కోరారు. అనంతరం వైద్య నిపుణులు మాట్లాడుతూ మానవ జీవనశైలి సంబంధిత రుగ్మతలు, చర్మ సంబంధిత, వాతం, మహిళలకు వచ్చే రుగ్మతలు, శ్వాస, అర్ష



తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరంలో మొత్తం 320 మంది రోగులను పరిక్షించి ఉచితంగా ఆయుర్వేద మందులు అందజేశారు. యోగా ఇన్‌స్ట్రక్టర్లు పలు ఆసనాలు ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చుంచుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల యోగా ఇన్‌స్ట్రక్టర్ కె. కమలారాణి, టైటీసీసీ ఉమ్మడి జిల్లా వైస్ ప్రెసిడెంట్, ఆయుర్వేద వైద్యులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రకృతి హరిత దీక్షాపరురాలు నైనిక రజువా ఆయుర్వేద వైద్యులకు మొక్కలను బహుమతిగా అందించి ప్రకృతి పట్ల తన ప్రేమను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డీపీఎం డాక్టర్ మహేష్‌గౌడ్, శిబిరం ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం. లావణ్య, మాజీ కౌన్సిలర్ బాలిశెట్టి సత్యభామ, వైద్యులు జి. అరుణ, ఉషారాణి, సుందర్, జయ, విజయశ్రీ, శ్రీదేవి, పవని, గీతా మాధురి, ఫార్మసిస్టులు వీరయ్య, రామకృష్ణ, సంతోష్, రేణుక, సాంబశివరావు, ఎస్.ఎన్.ఓ రవి, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, ఆశా వర్కర్లు తదిరులు పాల్గొనగా, స్థానిక ప్రజలు శిబిరానికి వచ్చి వైద్య సేవలు పొందారు.

## కలెక్టర్ కార్యాలయంలో ముద్దపప్పు బతుకమ్మ సంబరాలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ముద్దపప్పు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు భక్తి శ్రద్ధలతో బతుకమ్మను అలంకరించి, జానపద గీతాలు, నృత్యాలతో ఉత్సవాలను ఆనందంగా జరిపారు.అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ ఉద్యోగుల మధ్య సఖ్యత పెంపొందించే వేడుకలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా, సిబ్బంది, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## బతుకమ్మకుంటలో హైడ్రా కమిషనర్ బోటు షికారు



తెలంగాణ బ్యూరో: బతుకమ్మకుంటను హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ మంగళవారం రాత్రి సందర్శంచారు. ఈ నెల 26న జరగనున్న బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ కుంటను నగర ప్రజలకు అంకితం ఇవ్వనున్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. 26 నాటికి బతుకమ్మ కుంటతో పాటు పరిసరాలు సర్వాంగ సుందరంగా మారాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు కూడా బతుకమ్మకుంటను సందర్శించి.. హైడ్రా పని తీరును ప్రసంశించారు. బతుకమ్మ కుంటను చూస్తుంటే.. ఇది కలా నిజమా అనేది అర్థం కావడంలేదని స్థానికులు ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుని.. ఈ బాధ్యతను హైడ్రాకు అప్పజెబితే.. ఆ పనిని విజయవంతంగా పూర్తి చేసిందని కొనియాడారు. తర్వాత బతుకమ్మ కుంటలో హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ బోటులో విహరించారు. హైడ్రా అడ్మిన్ ఎస్పీ ఆర్. సుదర్శన్ వి. హనుమంతరావు కూడా కమిషనర్‌తో పాటు విహరించినవారిలో ఉన్నారు.

## అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న సౌమ్యకు సీఎం రేవంత్ రెడ్డి విషెస్



అంతర్జాతీయ ఫుట్ బాల్‌లో విశేష ప్రతిభ కనబరుస్తున్న తెలంగాణ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఇటీవల అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య నుంచి ఉత్తమ క్రీడాకారిణి అవార్డు అందుకున్న సౌమ్య ముఖ్యమంత్రిని మంగళవారం జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ మేరకు ఫుట్ బాల్ లో విశిష్ట ప్రతిభను చూపిస్తున్న సౌమ్యను సీఎం అభినందించారు. ఈ సందర్భంగా సౌమ్యకు సీఎం రేవంత్ శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డితో పాటు అధికారులు, తెలంగాణ ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మహమ్మద్ అలీ రఫాత్, ప్రధాన కార్యదర్శి పాల్గుణ ఉన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల లాభాల వాటా పై మండిపడ్డ జేఏసీ




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ సమావేశం స్థానిక కొత్తగూడం సిఐటియు ఆఫీసులో మల్లెల రమనాథం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు బి మధు, షేక్ యాకూబ్ షావలి ,ఎం కరుణాకర్, మల్లెల రమణాథం పాల్గొని మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల రెక్కల కష్టంతో వచ్చిన లాభాల వాటా లో పెంచకపోతే బాగుండేది అని, దారుణంగా 500 పెంచి అవమానించారన్నారు.కోల్ బెల్టు ఎమ్మెల్యేలు నెలరోజుల్లో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారనీ అన్నారు. 22 నెలలు గడిచినా, వేతనాలు పెంచలేదన్నారు. ఇప్పుడు లాభాల వాటాలో శ్రమజీవులకి తీవ్ర అన్యాయం చేశారని అన్నారు.12వ తారీకు నాడు జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ప్రజాభవన్ కార్యక్రమానికి వచ్చిన వామపక్ష నాయకులు జూలకంటి రంగారెడ్డి , ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య , యూనియన్ ప్రతినిధులతో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడి హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు.ఓడేక్కినంక ఓడ మల్లయ్య ఓడ దాటినంక బోడ మల్లయ్య అన్న విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ లాభాల వాటలో ఉందని వారు దుయ్యబట్టారు.సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు మరొక్కసారి ఎవరో వస్తారు ఏదో చేస్తారనీ, కండవలు వేసుకుంటాం అని మోసపోతే గిట్లనే ఉంటది అన్నారు . ఇప్పటికైనా కాంటాక్ట్ కార్మికులకు పోరాటం తప్ప మరొక్క మార్గం లేదని ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, విజయ్ పాల్గొన్నారు.



## బాలా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు

*** పూజల్లో పాల్గొన్న కాల్వమీది రమేష్,లక్ష్మి దంపతులు...**

అందోలు, ప్రజాస్ఫూర్తి:అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలోని దుర్గా భవాని మాత ఆలయం వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు దుర్గమ్మ 'బాలత్రిపుర సుందరి' గా దర్శనమిచ్చారు. అమ్మవారికి లేత ఆకుపచ్చ రంగు చీరను అలంకరించారు. అమ్మవారికి ఇష్టమైన తుమ్మి పూవులతో పూజ చేశారు.సిరా పాయసం, శెనగలు, పులిహోర, పరమాన్నం నైవేద్యంగా సమర్పించారు. పూజల్లో భాగంగా మూల విగ్రహానికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చనలను పురోహితులు ఆనంద్ శర్మ వేదమంత్రచ్చరణాల మధ్య ఘనంగా జరిపించారు. బిజెపి నాయకులు కాల్వమీది రమేష్, లక్ష్మి దంపతులు పూజల్లో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా బాలా త్రిపుర సుందరి దేవి అవతార విశిష్టతను గూర్చి తెలియజేశారు. ఈరోజు రవికుల గుడ్డ దానం చేస్తే పుణ్యం కలుగడంతో పాటు సద్బుద్ధి కార్యసిద్ధి లభిస్తుందన్నారు. త్రిపురుని భార్య త్రిపుర సుందరీ దేవి అంటే ఈశ్వరుడి భార్య గౌరీదేవి అని అర్థమని, అమ్మను ఆరాధిస్తే మానసిక బాధలు తొలిగిపోతాయన్నారు. త్రిపురసుందరీ దేవి అనుగ్రహం కోసం ఈరోజు బాలార్చన చేయాలని ఈ దేవత అనుగ్రహిస్తే సంతానం కలుగుతుందని వివరించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



## నిజాంపేటలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు...

*** కుమారి దేవి గా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విజయదశమి మహోత్సవంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేటలో గల శ్రీ కనక దుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం దేవి శరన్న వరాత్రి ఉత్సవాలు మంగళ వాయిద్యాలతో వైభవంగా నిర్వహించారు.ఆలయంలో రెండవ రోజు కుమారి దేవి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా ఆలయంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆయన సతిమణి కొలను తేజ శ్రీనివాస్ రెడ్డి, లీడర్ కొలన్ నరసింహారెడ్డి వారి సతీమణి పద్మమ్మ లు పాల్గొని అమ్మవారి ఆలయం నందు కుమారి దేవి చండీ హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వివాహం కాని వారికి అమ్మవారి అనుగ్రహంతో వారికి పెళ్లి అవుతుందన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఎవరైతే మగ , ఆడ వివాహం కాని వారికి వివాహం జరిగి సుఖ సంతోషాలతో



ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నారు. కుజదోష నివారణ జరగాలని ఈ యొక్క చక్కనిదైనటువంటి ఆరాధనలో పాల్గొని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, బొర్రా అశోక్ , నిజాంపేట్ గ్రామ పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారిని ఆరాధించుకున్నారు

## ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు

*** అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పట్టివేత**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా మండలంలోని తెరుమద్ది శివారులో గల నక్క వాగు నుంచి అక్రమంగా రెండు ట్రాక్టర్లలో ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. ఇసుకను తరలిస్తున్న నర్సింల తండాకు చెందిన రమావత్ నవీన్, రమావత్ ప్రవీణ్‌లను రిమాండ్ చేసి తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఎవరైనా ఇసుకను తరలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## పెండింగులో ఉన్న పైప్ లైన్ పనులను త్వరలోనే పూర్తి చేయాలి

*** రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : పెండింగులో ఉన్న పైప్ లైన్ పనులను త్వరలోనే పూర్తి చేసి నీరు నిల్వకుండా చేయాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ సమస్యలపై కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ,హైడ్రా,ఐలా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా గిరినగర్ ప్రాంతంలో శిథిలమైన భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ మార్చాలని అయన అధికారులకు సూచించారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాలలో నెలకొని ఉన్న సమస్యలపై దశలవారీగా పరిష్కరిస్తానని స్థానిక అన్నారు.వర్షపు నీరు నిల్వకుండా బాక్స్ డ్రైన్ ఏర్పాటు చేయడం కొరకు స్థలం పరిశీలించారు.పాడైన సీసీ రోడ్ల పనులు త్వరలోనే మొదలుపెట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.గాంధీనగర్ నుండి ఆస్బెస్టాస్ కమాన్ వెళ్లే ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుండగా, ,వెంకట్ రామ్ రెడ్డి నగర్ లోని నాలా నుండి నీరు బయటికి ప్రవహిస్తున్న సమస్యను తెలుసుకుని,నాలాలో పేరుకుపోయిన మట్టి పూడికనుతీసి నాలలోని వరద నీరు రోడ్డు మీదకు రాకుండా చేయాలని అధికారుల ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు,జలమండలి డీజిఎమ్ మేనేజర్,హైడ్రా అధికారులు,గాంధీనగర్ ఐలా చైర్మన్ పైడిపల్లి స్వామిగౌడ్,మేనేజర్ నజీర్ బాషా,స్థానిక సంక్షేమ సంఘాల అధ్యక్షులు,కమిటీ సభ్యులు,కాలనీల ప్రజలు,డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

## కేటీఆర్‌కు అరుదైన గౌరవం.. ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగనున్న ప్రతిష్టాత్మక 'తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానం అందింది. ఈ ఆహ్వానాన్ని తాల్ హాస్పిటల్స్ సీఈఓ సాయి గుండవెల్లి హైదరాబాద్‌లో కేటీఆర్‌కు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ సాయి గుండవెల్లి వెంట ఉన్నారు. వచ్చేనెల 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగోలో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు.

# చదువుకుందామని వస్తే.. తుపాకీ ఇచ్చి యుద్ధం చేయమంటున్నారు..



ఇటీవల ఉన్నత చదువుల కోసం రష్యా వెళ్లిన తమ కుమారుడిని అక్కడి అధికారులు ఉక్రెయిన్ యుద్ధ ప్రాంతానికి పంపారని భారత్‌కు చెందిన ఓ కుటుంబం ఆరోపించింది. ప్రస్తుతం రష్యా సైన్యం ఆధీనంలో ఉన్న తమ కుమారుడిని స్వదేశానికి రప్పించాలని భారత విదేశాంగ అధికారులను ఆశ్రయించింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరాఖండ్‌లోని ఉధమ్ సింగ్ నగర్‌కు చెందిన రాకేశ్ కుమార్ (30) అనే యువకుడు స్టడీ వీసాపై రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ పొందాడు. ఉన్నత చదువుల కోసం ఆగస్టు 7న మాస్కోకు వెళ్లాడు. అయితే అక్కడికి వెళ్లిన కొద్ది రోజులకు ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొనాలని తనను కొందరు అధికారులు బలవంతపెడుతున్నట్లు రాకేశ్ అతడి కుటుంబసభ్యులకు తెలియజేశాడు. ఆగస్టు 30న రాకేశ్ తమతో మాట్లాడాడని.. రష్యా సైన్యం తనను బలవంతంగా తమ సైన్యంలో చేర్చుకున్నారని తెలిపాడని అతడి కుటుంబసభ్యులు పేర్కొన్నారు. త్వరలో తనను ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న ప్రాంతానికి తరలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పాడన్నారు. ఆ తర్వాత రష్యన్ సైనిక యూనిఫాంలో రాకేశ్ ఉన్న ఫోటోను తమకు పంపినట్లు తెలిపారు. చివరిసారిగా కొత్త ఫోన్ నెంబర్ నుంచి తమకు కాల్ చేసి.. అక్కడి అధికారులు తన పాస్‌పోర్ట్, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడన్నారు. యుద్ధానికి వెళ్లే ముందు తనకు డాన్‌బాస్ అనే ప్రాంతంలో సైనిక శిక్షణను సైతం ఇచ్చినట్లు చెప్పాడన్నారు. సెప్టెంబర్ ప్రారంభం నుంచి తమ కుమారుడు అందుబాటులోకి రావట్లేదని రాకేశ్ తల్లిదండ్రులు విదేశాంగ శాఖకు తెలియజేశారు. తమ కుమారుడి ఆచూకీ కనుగొనడంలో సహాయం చేయాలని, తిరిగి భారత్‌కు రప్పించాలని మాస్కోలోని భారత రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై విదేశాంగ శాఖ నుంచి అధికారిక సమాచారం రావాల్సి ఉంది.



# త్వరలో వందే భారత్ స్లీపర్..!

## రైల్వే మంత్రి క్లారిటీ

వందే భారత్ స్లీపర్ సర్వీసులకు సంబంధించి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కీలక విషయం వెల్లడించారు. ప్రస్తుతం ఒక రైలు దిల్లీలో సిద్ధంగా ఉందని, మరో రైలు అక్టోబర్ 15 నాటికి సిద్ధమవుతుందన్నారు. అది వచ్చిన వెంటనే రెండు కలిపి ప్రారంభిస్తామన్నారు. దిల్లీలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. రైల్వే శాఖ గత పదేళ్లలో చేపట్టిన పలు కీలక ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు. ఇక వందే భారత్ స్లీపర్ విషయానికొస్తే.. రెగ్యులర్ సర్వీసులు కొనసాగించాలంటే కనీసం రెండు రైళ్లు అవసరమని, అందుకే మరో దానికోసం వేచి చూస్తున్నామన్నారు. ఆ తర్వాతే ఏ మార్గంలో నడపాలనేది నిర్ణయిస్తామన్నారు. అయితే, బిహార్‌లో మరికొన్ని రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో తొలి వందే భారత్ స్లీపర్ రైలు దిల్లీ నుంచి పట్నా మధ్య ప్రారంభించే అవకాశం ఉందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.

## కాంగ్రెస్ ఎంపీ 'నెపోకిడ్' పోస్ట్..

# రాహుల్ గాంధీ గురించేనంటూ భాజపా సెటైర్లు

శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ చవిచూసిన రాజకీయ అస్థిరతలపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ చేసిన పోస్టు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఆయన రాహుల్ గాంధీని ఉద్దేశించే పోస్టు పెట్టారని భాజపా సెటైర్ వేయగా.. కొంతమంది వ్యక్తుల ఆలోచనాశక్తిని పెంచాలని తాను కోరుకుంటున్నట్లు తివారీ కౌంటర్ ఇచ్చారు. ఇంతకీ ఏం జరిగిందంటే..? "2023లో శ్రీలంక, 2024లో బంగ్లాదేశ్, 2025లో నేపాల్‌లో ప్రభుత్వాలు కూలిపోయాయి. ఇప్పుడు ఫిలిప్పైన్స్‌లో ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌కు వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయి. ప్రత్యేక అధికారాలు జెన్ ఎక్స్, వై, జీకు ఇక ఏమాత్రం ఆమోదయోగ్యం కావు" అని నెపోకిడ్స్ హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. అలాగే సవాళ్లు ఎదుర్కొంటున్న రాజవంశాల గురించి ప్రస్తావించారు.



ఈ పోస్టుపై భాజపా వ్యంగ్యాస్త్రాలు గుప్పించింది. "కాంగ్రెస్ సీనియర్ నేత, అసమ్మతి గ్రూపు జీ23 సభ్యుడైన మనీశ్ తివారీ.. భారత రాజకీయాల్లో తిరుగులేని నెపోకిడ్ రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకున్నారు. జెన్ జీ సంగతి పక్కనపెడితే.. పార్టీ సీనియర్ నేతలే రాహుల్ అనుసరిస్తోన్న తిరోగమన రాజకీయాల పట్ల విసిగిపోయారు" అని భాజపా నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా స్పందించారు. అంతర్గతంగానే వ్యతిరేకత ఉందనే అర్థంలో రాసుకొచ్చారు. దీనిపై తివారీ కౌంటర్ ఇచ్చారు. "కొంతమంది ఆలోచనా శక్తి పెరగాలని నేను ఆ దేవుడిని కోరుకుంటున్నాను. దక్షిణ, తూర్పు ఆసియాలో జరుగుతున్న పరిణామాలు జాతీయభద్రతా ప్రభావాలను కలిగి ఉన్నాయి. అవి ఎందుకు జరుగుతున్నాయో సరైన కోణంలో అర్థం చేసుకోవాలి" అని సూచించారు. ఇదిలాఉంటే.. కాంగ్రెస్‌కు సమర్థ నాయకత్వం కావాలని, సంస్థాగతంగా పునర్నిర్మాణం జరగాలని కొందరు సీనియర్ నేతలు పార్టీని బహిరంగంగానే విమర్శించిన సంగతి తెలిసిందే. ఆ నేతల గ్రూపును జీ23గా పిలుస్తున్నారు.

# ప్రజాధనం.. మీ నేత విగ్రహాలకా? : సుప్రీంకోర్టు

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే దివంగత నేత కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తప్పుపట్టింది. 'మీ నేతలను కీర్తించేందుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారు'' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రభుత్వం తన పిటిషన్‌ను ఉపసంహరించుకొని, ఈ వ్యవహారంపై మద్రాస్ హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది. తిరునెల్వేలి జిల్లాలోని వల్లియూర్ వెజిటేబుల్ మార్కెట్ ప్రవేశద్వారం వద్ద కరుణానిధి కాంస్య విగ్రహం ఏర్పాటుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. ఆ పిటిషన్‌పై అసహనం వ్యక్తంచేసిన అత్యున్నత న్యాయస్థానం.. గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదని హైకోర్టు అప్పుడు స్పష్టంచేసింది. ఇలాంటి ఏర్పాట్ల వల్ల ట్రాఫిక్ సమస్యలతో



ప్రజలు ఇబ్బంది పడతారని అనుమతి నిరాకరించింది. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతి ఇవ్వకూడదంటూ గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేసింది. ఆ నేపథ్యంలో ప్రభుత్వాలు అనుమతి ఇవ్వడం సాధ్యంకాదని తేల్చిచెప్పింది. తమిళనాడు రాజకీయాలపై కరుణానిధి చెరగని ముద్ర వేశారు. దశాబ్దాల పాటు డీఎంకే పార్టీని నడిపిన ఆయన.. ఐదుసార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. తమిళం మాట్లాడే ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు.

# విప్రో క్యాంపస్ నుంచి వాహనాలను అనుమతించండి

**: అజీమ్ ప్రేమ్‌జీకి సీఎం లేఖ**

బెంగళూరులో ట్రాఫిక్ రద్దీపై తీవ్ర విమర్శలు వస్తుండడంతో రద్దీని నియంత్రించేందుకు సిద్ధరామయ్య సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీకి సీఎం లేఖ రాశారు. బెంగళూరులోని విప్రో క్యాంపస్ లోపలి నుంచి కొన్ని వాహనాలను అనుమతించాలని కోరారు. దీనివల్ల ఆ చుట్టుపక్కల రహదారులపై ట్రాఫిక్ రద్దీ 30శాతం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొద్ది మొత్తంలో వాహనాలను అనుమతించినా ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు గణనీయమైన ఉపశమనం కలుగుతుందని సిద్ధరామయ్య లేఖలో పేర్కొన్నారు. ఐటీ సంస్థలకు నెలవైన బెంగళూరులోని ఔటర్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంపై ప్రయాణికులు, పౌర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బెంగళూరులో రోడ్ల పరిస్థితిపై 'బ్లాక్‌బక్' అనే కంపెనీ సీఈవో రాజేశ్ యాబాజీ పెట్టిన పోస్టు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. 'గతంలో ఇంటినుంచి కార్యాలయానికి వెళ్లి రావడం తేలికగా ఉండేది. ఇప్పుడు అది కఠినంగా మారిపోయింది. ఆఫీసుకు రావాలంటే మా ఉద్యోగులకు గంటన్నర పడుతుంది. రహదారులన్నీ గుంతలు, దుమ్ముతో నిండిపోయాయి. గత ఐదేళ్లలో ఈ పరిస్థితుల్లో మార్పేమీ రాలేదు. మేము ఇక్కడినుంచి వెళ్లిపోదామని నిర్ణయించుకున్నాం' అంటూ రాజేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్టుపై పలువురు నేతలు సైతం స్పందిస్తుండడంతో రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. బెంగళూరులో గుంతల రోడ్లపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన



రహదారులపై ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బెంగళూరులోని అన్ని రహదారులపై మరమ్మతులు చేయడానికి అధికారులకు నెల రోజుల గడువు విధించారు. గడువు లోపు పనులు పూర్తి చేయకపోతే చీఫ్ ఇంజినీర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఎం హెచ్చరించారు. ఈ క్రమంలోనే తాజాగా విప్రో వ్యవస్థాపకుడు అజీమ్ ప్రేమ్‌జీకి లేఖ రాశారు.

# ప్రధాని ఉండే రోడ్డులోనూ గుంతలు: డీకే శివకుమార్ విమర్శలు

భారీ వర్షాలు, నిర్వహణ లోపాలతో గుంతలమయమైన బెంగళూరు రోడ్లపై సర్వత్రా చర్చ జరుగుతుంది. ఈ సమస్యపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. ఈసందర్భంగా గుంతల సమస్య దేశమంతటా ఉందని, ప్రధాని మోదీ ఉండే రోడ్డులో కూడా ఉందని వ్యాఖ్యానించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను నిన్న దిల్లీలో పర్యటించాను. ప్రధానమంత్రి నివాసానికి వెళ్లే రహదారిపై కూడా గుంతలు ఉన్నాయి. కేవలం బెంగళూరునే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ గుంతల సమస్య దేశమంతటా ఉందని పెద్ద ఐటీ కంపెనీలకు చెప్పాలనుకుంటున్నా. వాటిని



పూడ్చడమే మన కర్తవ్యం. మీడియా కూడా ఈ సమస్యకేవలం కర్ణాటకలోనే ఉన్నట్లు చూపిస్తోంది. భాజపా అంతా సరిగ్గా చేస్తే.. రోడ్లు ఇలా ఎందుకు ఉంటాయి' అని డీకే వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ.. పౌర బృందాలు రోజుకు వేల గుంతలు పూడ్చుతున్నారని తెలిపారు. బెంగళూరులో రోడ్ల పరిస్థితిపై 'బ్లాక్‌బక్' అనే కంపెనీ సీఈవో రాజేశ్ యాబాజీ పెట్టిన పోస్టు తీవ్ర చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. రహదారులన్నీ గుంతలు, దుమ్ముతో నిండిపోయాయని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పరిస్థితిలో మార్పేమీ రాలేదని, ఇక్కడినుంచి తాము వెళ్లిపోదామని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. దీనిపై డీకే స్పందిస్తూ.. ఇలాంటి బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌ను ప్రభుత్వం కనీసం పట్టించుకోదంటూ ఘాటుగా బదులిచ్చారు. రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.1,100 కోట్లు కేటాయించిందని వెల్లడించారు.

# హెచ్1బీ వీసా ఫీజులపై ట్రంప్ లాజిక్ ఏంటో ?

**: శశిథరూర్**

హెచ్1బీ వీసాల ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ కారణాలతోనే ట్రంప్‌ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శశిథరూర్ దీనిపై మాట్లాడారు. 'ట్రంప్ నిర్ణయాలు దేశీయ రాజకీయాలతో ముడిపడి ఉంటాయి. హెచ్1బీ వీసాల కారణంగా ఎక్కువ జీతాలు తీసుకొనే అమెరికన్ల కంటే, తక్కువ జీతాలు తీసుకొనే భారతీయుల వైపే అక్కడి కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని ట్రంప్ ఆయన కార్యవర్గం భావిస్తోంది. అయితే, ఫీజు లక్ష డాలర్లకు పెంచితే తమకు కావాల్సిన, ఎక్కువ నైపుణ్యం కలిగిన వ్యక్తులు మాత్రమే అమెరికాకు వస్తారని వారు అనుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనక ట్రంప్ లాజిక్ ఏంటో, ఇది నిజంగా వర్కౌట్ అవుతుందా అనేది నాకు అర్థం కావడం లేదు. దీంతో అనేక కంపెనీలు ఎక్కువ ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్‌కు ఇచ్చేస్తాయి' అని పేర్కొన్నారు.

*** సుంకాలను మాయా సాధనంగా భావిస్తున్నారు**

ఇక, భారత దిగుమతులపై ట్రంప్ పెద్ద మొత్తంలో సుంకాలు విధించడంపైనా



థరూర్ మాట్లాడారు. అనేక సమస్యల పరిష్కారానికి సుంకాలు అనేవి ఒక మాయా సాధనంగా ట్రంప్ భావిస్తున్నారన్నారు. ఈ టారిఫ్‌ల నుంచి వచ్చే బిలియన్ డాలర్లతో యూఎస్‌లో నెలకొన్న లోటును పూడ్చాలనేది ఆయన ఉద్దేశమై ఉంటుందన్నారు. అయితే, భారత్‌పై సుంకాల విధింపుతో ఆయనకు ఇక్కడ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. భారత్‌ను ఉద్దేశిస్తూ తరచూ ట్వీట్‌లు పెట్టడం, ఆయన సలహాదారుడు నవారో అభ్యంతరకర వ్యాఖ్యలతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత్‌కు కాస్త ఎదురుదెబ్బేనన్నారు. అయితే, ప్రస్తుతం వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు జరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని తాను భావిస్తున్నట్లు తెలిపారు.

# కోల్‌కతాలో భారీ వర్షాలు.. ఐదుగురు మృతి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కోల్‌కతాను ముంచెత్తాయి. వరదల కారణంగా ఉత్తర కోల్‌కతాలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ షాక్ వల్ల ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. వరదల్లో కొట్టుకుపోయి మరో ఇద్దరు మరణించారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉన్నందున దక్షిణ బెంగాల్‌లోని పలు జిల్లాల్లో రానున్న కొన్ని గంటల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వానల వల్ల పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగినట్లు విమానయాన సంస్థలు వెల్లడించాయి. అటు ఎయిరిండియా, ఇండిగో ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. భారీ వర్షాల కు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు చాలా ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. కొన్ని



భవనాలు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజలు సాధ్యమైనంతవరకు ఇళ్లల్లోనే ఉండాలని.. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. భారీ వరదల వల్ల షాహిద్ ఖుదిరామ్, మైదాన్ స్టేషన్ల మధ్య పలు రైల్వే కార్యకలాపాలను నిలిపివేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

*** ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తిన వానలు**

ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకరస్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పంజాబ్, హరియాణా, చండీగఢ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. పఠాన్‌కోట్, గుర్‌దాస్‌పుర్, ఫాజిల్కా, కపూర్థలా, తరన్‌తరన్, ఫిరోజ్‌పుర్, హోశియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీ చేసింది. పంజాబ్‌లో వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. రాజస్థాన్ రాజధాని జైపుర్‌తో సహా పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి.

## స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారంలో రెండోరోజైన మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ట్రంప్ తీసుకొన్ని హెచ్1బీ వీసాల పాలసీ నేపథ్యంలో మార్కెట్లు సోమవారం నష్టపోయిన విషయం తెలిసిందే. మంగళవారం సైతం మార్కెట్లు నష్టాల్లోనే మొదలయ్యాయి. చివరి సెషన్‌లో కొద్దిగంటల పాటు మార్కెట్లు రికవరీని నమోదు చేశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 82,147.37 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82,370.38 అత్యధికంగా పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 81,776.53 పాయింట్ల మార్క్‌ను తాకింది. చివరకు 57.87 పాయింట్ల నష్టంతో 82,102.10 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 32.85 నష్టంతో 25,169.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ట్రెంట్, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ లైఫ్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, నెస్లే, ఆసియన్ పెయింట్స్, సిప్లా, గ్రాసిమ్, ఎటర్నల్, హీరో మోటోకార్ప్ అత్యధికంగా నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.3 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 250 ఇండెక్స్ 0.5 శాతం పడిపోయాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ ఇండెక్స్ ఒకశాతానికిపైగా పడిపోయింది. రియాలిటీ, ఐటీ ఇండెక్స్ సైతం పతనం కాగా.. పీఎస్‌యూ బ్యాంక్, మెటల్ ఇండెక్స్ ఒక్కోశాతానికిపైగా పెరిగాయి.

## జీఎస్టీ సంస్కరణలు, నవరాత్రి వేడుకలు..

### తొలిరోజే రికార్డు స్థాయిలో కార్ల అమ్మకాలు..!



**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు అమలులోకి తీసుకువచ్చింది. నవరాత్రి (ఈ నెల 22న) వేడుకల తొలిరోజున అమలులోకి రాగా.. ఆటో మొబైల్ రంగానికి భారీగా ఊతమిచ్చాయి. ఓ వైపు జీఎస్టీ సంస్కరణలు.. మరో వైపు నవరాత్రి వేడుకల ప్రారంభంతో దేశంలోని అన్ని కార్ల షోరూమ్‌లు వినియోగదారులతో కళకళలాడుతున్నాయి. వినియోగ దారుల రద్దీ పెరగడంతో పలు కంపెనీలు సోమవారం రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపాయి. కేంద్రం జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా చిన్న కార్లు, ఎస్‌యూవీలపై 28 నుంచి 18శాతానికి జీఎస్టీ తగ్గించిన విషయం తెలిసిందే. ఇది కొనుగోలుదారులను ఆకర్షించింది. భారత్‌లో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సోమవారం మాత్రమే 80వేల కంటే ఎక్కువగా ఎక్వైరీస్ రాగా.. దాదాపు 30వేల వాహనాలను డెలివరీ చేసింది. ఇక హ్యుందాయ్ సైతం 11వేల యూనిట్లు విక్రయించింది. కంపెనీలు జీఎస్టీ ప్రయోజనాన్ని వినియోగ దారులకు అందిస్తుండడంతో వినియోగదారులు కార్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మారుతి, హ్యుందాయ్ తదితర అనేక కంపెనీలు జీఎస్టీ తగ్గింపునకు తోడు అదనంగా డిస్కౌంట్స్‌ను ఇస్తున్నాయి. మారుతి వాహనాలపై రూ.1.29లక్షల వరకు భారీ డిస్కౌంట్స్ ఇస్తున్నది. మారుతి ఎస్-ప్రెస్సో కారు ధర రూ.1.29 లక్షలు తగ్గించి ప్రస్తుతం రూ.3.50 లక్షల ప్రారంభ ధరకు అమ్ముతున్నారు. మహీంద్రా బొలెరో, బొలెరో నియో రూ.2.56 లక్షల వరకు తగ్గాయి. టాటా పంచ్, కియా సైరోస్ కూడా రూ.1.6 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది. ఈ పండుగ సీజన్ ఆటోమొబైల్ కంపెనీలకు కీలక సమయం. ఎందుకంటే ఇది వారి వార్షిక అమ్మకాలు ఈ సమయంలో గణనీయంగా ఉంటాయి. గత కొన్ని నెలలుగా భారత ప్రయాణీకుల వాహన పరిశ్రమ బలహీనమైన అమ్మకాలతో ఇబ్బంది పడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు దాదాపుగా స్థిరంగా ఉన్నాయి. సంవత్సరం వారీగా వృద్ధి మొదట్లో 1-4శాతం ఉంటుందని అంచనా వేసింది. అయితే, జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో ఈ వృద్ధి రేటు 5నుంచి7శాతానికి చేరుకుంటుందని అంచనా. ఎస్అండ్‌పీ గ్లోబల్ మొబిలిటీ కూడా 2026కి భారతదేశంలో ప్రయాణీకుల వాహన పరిశ్రమకు దాని వృద్ధి అంచనాను 4.1శాతం నుంచి 8.5శాతానికి పెంచింది. ఆటోమొబైల్ రంగం త్వరలో మాంద్యం నుంచి బయటపడే అవకాశం ఉందని అంచనా వేసింది.

## పసిడి పరుగులు..



**హైదరాబాద్:** బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. పసిడి పరుగులకు గోల్డ్ లవర్స్ బెంబేలెత్తిపోతున్నారు. ఆల్ టైం హైలెవల్‌కు బంగారం ధరలు చేరాయి. సోమవారంతో పోలిస్తే మంగళవారం బంగారం ధరలు భారీగా పెరిగాయి. ఈ ధరలను చూసి పసిడి ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ఇక భవిష్యత్‌లో బంగారం కొనలేమా..? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి. 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 1,04,800 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,14,330 గా ఉంది. నిన్నటితో పోల్చితే 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1150, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1260 ఎగబాకింది. కేజీ వెండి ధర రూ. 1,49,000లకు చేరింది. నిన్నటితో పోల్చితే రూ. 1000 పెరిగింది.

చెన్నై నగరంలో బంగారం ధరలు ఈ విధంగా ఉన్నాయి. 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 1,05,000 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,14,550 గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 1,04,950 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,14,480 గా ఉంది.

# జోరు పెంచిన అశ్విన్..





### ఏకంగా మూడు టీ20 లీగ్స్‌కు సై..!

**న్యూఢిల్లీ:** భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ జోరు పెంచాడు. ఈమధ్యే ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన ఈ దిగ్గజం విదేశీ లీగ్స్‌లో మెరిసేందుకు సిద్ధమవుతున్నాడు. అలా అనీ ఒకటి రెండు లీగ్స్‌కే పరిమితం కావాలని ఈ వెటరన్ ప్లేయర్ అనుకోవడం లేదు. అవకాశం ఉన్న ప్రతి లీగ్‌లో తన ముద్ర వేయాలనే కసితో ఉన్నాడు. అవును.. ఒకే ఏడాదిలో మూడు విదేశీ లీగ్స్‌లో ఆడేందుకు సై అంటున్నాడు అశ్విన్. ఇదివరకే హాంకాంగ్ సిక్సర్స్ టోర్నీలో ఆడేందుకు ఓకే చెప్పిన అశ్విన్.. ఇంటర్నేషనల్ టీ20తో పాటు బిగ్‌బాష్ లీగ్‌లోనూ మెరవనున్నాడు.

టీమిండియా స్పిన్ లెజెండ్ అయిన అశ్విన్ ఐపీఎల్ వీడ్కోలు ప్రకటనలో తాను విదేశీ లీగ్స్‌పై దృష్టి సారిస్తానని చెప్పాడు. అతడలా చెప్పడమే ఆలస్యం.. పలు దేశాల ఫ్రాంచైజీలు మేము తీసుకుంటాం అని ముందుకొచ్చాయి. యూఏఈ వేదికగా జరిగే ఇంటర్నేషన్ లీగ్ 20, దక్షిణాఫ్రికాలో నిర్వహించే బెట్‌వే ఎస్ఏ20, ఆస్ట్రేలియాలోని 'బిగ్‌బాష్ లీగ్', ఇంగ్లండ్ గడ్డపై పాపులర్ అయిన 'ది హండ్రెడ్ లీగ్' ఇలా అశ్విన్ కోసం పావులు కదిపాయి. అయితే.. అశ్విన్ మాత్రం ఏమాత్రం తొందరపడకుండా మొదట తాను చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగిన హాంకాంగ్ సిక్సర్స్‌కు పచ్చజెండా ఊపాడు.

వారం రోజుల వ్యవధిలోనే ఈ స్పిన్ మాంత్రికుడు బీబీఎల్‌తో పాటు ఐఎల్20ల్లోనూ తన మార్క్ చూపించాలని ఆరాటపడుతున్నాడు. అందుకే.. ఐఎల్20 వేలంలో పేరు నమోదు చేసుకున్నాడు అశ్విన్. 'ఐఎల్20 నాలుగో సీజన్ వేలంలో పేరు రిజిష్టర్ చేసుకున్నాను. ఆరు జట్లు నాకోసం పోటీపడడం ఆసక్తిగా ఉండనుంది' అని అతడు వెల్లడించాడు. ఇక బీబీఎల్ జట్లు.. సిడ్నీ సిక్సర్స్, హొబర్ట్ హరికేన్స్, ఆడిలైడ్ స్ట్రయికర్స్ వంటి ఫ్రాంచైజీలు అతడిని భారీగా డబ్బులు ఆఫర్ చేస్తున్నాయి. దాంతో.. ఈ ఏడాదిలో రెండు లీగ్స్‌లో ఆడేందుకు సన్నద్ధమవుతున్నాడీ సీఎస్కే మాజీ ప్లేయర్.

**అక్టోబర్ 1న వేలం**

ఇంటర్నేషనల్ లీగ్ 20 నాలుగో సీజన్ వేలం దుబాయ్‌లో అక్టోబర్ 1న జరుగనుంది. ఈ లీగ్‌లోని ఆరు జట్లలో ఒకటి అశ్విన్‌ను భారీ ధరకు పట్టేసే అవకాశముంది. డిసెంబర్ 2 నుంచి ఎడిషన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ మధ్యలోనే డిసెంబర్ 14 నుంచి బిగ్‌బాష్ లీగ్ షురూ అవుతుంది. ఐఎల్20 జనవరి 4న ముగియగానే అశ్విన్ బీబీఎల్ కోసం ఆస్ట్రేలియాలో వాలిపోతాడు. ఈ టోర్నీ జనవరి 25న ఫైనల్‌లో ముగుస్తుంది.

ఒకవేళ ఐఎల్20లో అశ్విన్ ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టు నాకౌట్ దశలోనే ఇంటిదారి పడితే.. అతడు త్వరగానే బీబీఎల్ జట్టుతో కలిసే అవకాశముంది. అంతేకాదు.. షెడ్యూల్ కుదిరిలో అమెరికాలో జరిగే మేజర్ క్రికెట్ లీగ్‌తో పాటు ఇంగ్లండ్ వేదికగా సాగే ది హండ్రెడ్ లీగ్‌లోనూ ఈ ఆఫ్ స్పిన్నర్ ఆడినా ఆశ్చర్యపోనవసరం లేదు.

### బెట్టింగ్ యాప్ కేసులో
## ఈడీ ముందు హాజరైన యువరాజ్ సింగ్

**న్యూఢిల్లీ:** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో లింకున్న మనీ ల్యాండరింగ్ కేసులో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు టీమిండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ హాజరయ్యాడు. బెట్టింగ్ యాప్ 1 కేసులో దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. 43 ఏళ్ల యువీ తెలుపు రంగు టీషర్ట్, పాంట్‌లో ఈడీ ఆఫీసుకు వచ్చాడు. సెంట్రల్ ఢిల్లీలో ఉన్న ఈడీ కార్యాలయానికి 12 గంటలకు చేరుకున్నాడు. తన లీగల్ బృందంతో యువీ ఈడీ ఆఫీసుకు వెళ్లాడు. మాజీ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించారు. ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. పీఎంఎల్ఏ కేసులో యువీని ప్రశ్నించారు. ఇదే కేసులో ఇన్‌ఫ్లుయెన్సర్ అన్వేషి జైన్ కూడా ఇవాళ ఈడీ ముందు హాజరయ్యాడు.



ఇప్పటికే ఈ కేసులో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్, రాబిన్ ఊతప్పలను ఈడీ ప్రశ్నించింది. టీఎంసీ మాజీ ఎంపీ, నటుడు మిథున్ చక్రవర్తి, బెంగాలీ నటుగు అన్‌కుష్ హజ్రాలను కూడా కొన్ని వారాల క్రితమే ఈడీ విచారణ చేపట్టింది.

బెట్టింగ్ యాప్ కేసులో బుధవారం ఫిల్మ్ స్టార్ సోనూ సూద్‌ను కూడా ఈడీ విచారించనున్నది. 1బెట్టింగ్ యాప్ ద్వారా కోట్లల్లో స్కామ్ చేసి ప్రజల్ని మోసం చేస్తున్నారని ఈడీ ఆరోపిస్తున్నది. పన్నులు కట్టకుండా ఎగవేస్తున్నారని ఈడీ పేర్కొన్నది. 1 బెట్టింగ్ యాప్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్నది. ఆ బుక్‌మేకర్ సంస్థ సుమారు 18 ఏళ్లుగా బెట్టింగ్ ఇండస్ట్రీలో వ్యాపారం చేస్తున్నది.

కస్టమర్లు వేల రకాల క్రీడలపై బెట్టింగ్ పెట్టే అవకాశాలు ఉన్నాయి. ఆ కంపెనీకి చెందిన వెబ్‌సైట్ , యాప్ దాదాపు 70 భాషల్లో అందుబాటులో ఉంటుంది. బెట్టింగ్ యాప్ కేసులో మరికొంత మంది క్రీడాకారులు, మూవీ నటులు, ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్లు, సెలబ్రిటీలను ప్రశ్నించనున్నారు.

### బెంగాల్ క్రికెట్ సంఘం
## అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ



**కోల్‌కతా:** బెంగాల్ క్రికెట్ సంఘం (క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్) అధ్యక్షుడిగా మరోసారి టీమిండియా మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ ఎన్నికయ్యారు. సీఏబీ 94వ వార్షిక జనరల్ సమావేశాల్లో సౌరవ్ గంగూలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఆరేళ్ల తర్వాత మళ్లీ గంగూలీ బెంగాల్ క్రికెట్‌లో కీలక పాత్ర పోషించనున్నారు. గతంలో బెంగాల్ టైగర్ సౌరవ్ 2015 నుంచి 2019 వరకు రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా చేశారు. సోదరుడు స్నేహాశిశ్ గంగూలీ స్థానంలో సౌరవ్ గంగూలీ బాధ్యతలు స్వీకరించనున్నారు. సీఏబీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీతో పాటు ఇతర కీలక పదవులకు కూడా అపాయింట్‌మెంట్ జరిగింది. సౌరవ్ గంగూలీ ఎన్నికపై సీఏబీ ఎలక్టోరల్ ఆఫీసర్ సుశాంత్ రంజన్ ఉపాధ్యాయ ప్రకటన చేశారు. స్నేహాశిశ్ గంగూలీ మూడేళ్ల పాటు అధ్యక్షుడిగా చేశారు. టీమిండియాకు సౌరవ్ గంగూలీ సారథ్య బాధ్యతలు నిర్వర్తించాడు. 2019 నుంచి 2022 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా చేశారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ కమిటీలో కీలక పదవిలో చేశారు. మళ్లీ బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల సౌరవ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో ప్రేక్షకుల కెపాసిటీ పెంచేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సౌరవ్ చెప్పారు. వచ్చే ఏడాది జరిగే టీ20 వరల్డ్‌కప్‌కు కూడా ప్రియార్టీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్‌కు గాయం..

### వరల్డ్ కప్ కల చెదిరిందిగా..!



**సిడ్నీ:** మహిళల వన్డే వరల్డ్ కప్ సన్నద్ధత సిరీస్‌లో భారత జట్టును ఓడించి జోరు మీదుంది ఆస్ట్రేలియా. మరోసారి టైటిల్ కొల్లగొట్టాలని వ్యూహాలు పన్నుతున్న ఆ జట్టుకు అనుకోకుండా భారీ షాక్ తగిలింది. ప్రపంచ కప్ మరో ఏడు రోజుల్లో ప్రారంభం కానుందనగా ఆల్‌రౌండర్ గ్రేస్ హ్యారిస్ టోర్నీకి దూరమైంది. వరల్డ్ కప్ ఆడాలని ఎన్నో కలలు కన్న ఆమెను గాయం రూపంలో దురదృష్టం వెంటాడింది. దాంతో.. నిరాశగా స్వదేశం బయల్దేరనుంది హ్యారిస్. ఈ స్టార్ ఆల్‌రౌండర్ స్థానంలో హీథర్ గ్రాహంను స్క్వాడ్‌లోకి తీసుకున్నట్టు ఆస్ట్రేలియా క్రికెట్ వెల్లడించింది.

ప్రపంచ కప్ సన్నాహకంగా భారత జట్టుతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో హ్యారిస్ ఒకేఒక మ్యాచ్ ఆడింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మూడో వన్డేకు ముందు తొడ కండరాల నొప్పితో అనాబెల్ సథర్‌లాండ్ ఇబ్బందిపడింది. దాంతో హ్యారిస్‌కు ఛాన్స్ వచ్చింది. కానీ.. ఫీల్డింగ్ చేస్తుండగా ఆమె గాయపడింది. సో.. వరల్డ్ కప్ ఆడాలనే కల నెరవేరకుండానే హ్యారిస్ ఇంటిముఖం పట్టనుంది. 2019 తర్వాత మొదటిసారిగా వరల్డ్ కప్ ముందు మ్యాచ్ ఆడిన ఆమె.. ఈ మెగా టోర్నీలో చెలరేగిపోవాలని భావించింది. అయితే.. గాయం వెంటాడంతో ఉసూరుమంటూ తిరిగి వెళ్లనుంది.

ఆస్ట్రేలియా స్క్వాడ్ : అలీసా హేలీ(కెప్టెన్), తహ్లియా మెక్‌గ్రాత్(వైస్ కెప్టెన్), డార్సీ బ్రౌన్, అషే గార్డ్‌నర్, కిమ్ గార్త్, హీథర్ గ్రాహం, అలనా కింగ్, ఫొబే లిచ్‌ఫీల్డ్, సోఫీ మొలినెక్స్, బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, మేగన్ షట్, అనాబెల్ సథర్‌లాండ్, జార్జియా వొల్, జార్జియా వరేహమ్.

ప్రపంచ కప్‌లో అధిపత్యం చెలాయించే ఆసీస్ ఈసారి కూడా మెగా టోర్నీకి పక్కా ప్లాన్‌తో వస్తోంది. టాపార్డర్‌లో దంచికొట్టేందుకు అలీసా హేలీ, డార్సీ బ్రౌన్, ఫొబే లిచ్‌ఫీల్డ్ ఉన్నారు. తహ్లియా మెక్‌గ్రాత్, జార్జియా వరేహం, ఎలీసా పెర్రీ, అషే గార్డ్‌నర్ ఆల్‌రౌండర్లుగా ఇరగదీయడం ఖాయం. మేఘన్ షట్, సథర్‌లాండ్, జార్జియా వొల్‌తో కూడిన పేస్ దళం కూడా పటిష్టంగానే ఉంది.

# బేబీబంప్‌తో కత్రినా కైఫ్

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ కపుల్ కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ శుభవార్త చెప్పారు. తల్లిదండ్రులు కాబోతున్నట్లు తెలుపుతూ ఫొటోను పంచుకున్నారు. వారి జీవితంలో అత్యంత అందమైన దశకు స్వాగతం పలుకు తున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. కొత్త అధ్యాయం



ప్రారంభం కానుందంటూ కత్రినా బేబీ బంప్‌తో ఉన్న ఫొటోను పంచుకున్నారు. దీంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కొన్నేళ్ల ప్రేమ ప్రయాణం అనంతరం కత్రినా కైఫ్, విక్కీ కౌశల్ 2021లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. అప్పటి నుంచి కత్రినా తల్లి కానున్నట్లు ఎన్నోసార్లు వార్తలు వచ్చాయి. ఆమె వదులుగా ఉండే దుస్తులు ధరించిన ప్రతిసారీ సోషల్ మీడియాలో ఈ వార్తపై ప్రచారం జరిగేది. 'అలాంటి శుభవార్త ఉంటే మేమే స్వయంగా మీతో పంచుకుంటాం. సరైన సమయం వచ్చినప్పుడు మేం ఆ విషయాన్ని చెప్పడానికి సిగ్గుపడం' అంటూ ఈ జంట పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. ఇప్పుడు వారు అధికారికంగా ఈ శుభవార్త పంచుకోవడంతో అభిమానులు, సినీ ప్రముఖులు విషెస్ చెబుతున్నారు.కత్రినా 'మల్లీశ్వరి'గా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. వెంకటేశ్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమాతోనే ఆమె టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత బాలకృష్ణ కథానాయకుడిగా రూపొందిన 'అల్లరి పిడుగు'లోనూ సందడి చేసిన విషయం తెలిసిందే. చివరిగా విజయ్ సేతుపతితో కలిసి 'మెర్రీ క్రిస్మస్'తో మెప్పించారు. దీని తర్వాత ఆమె మరో ప్రాజెక్ట్‌ను అంగీకరించలేదు.

## ఇండస్ట్రీని షేక్ చేస్తున్న కొత్త హీరోయిన్..

### ఇక అందరూ సైడ్ అవ్వాల్సిందే !

టాకీస్: ఇండస్ట్రీ లోకి చాలామంది హీరోయిన్లు వస్తున్నారు. ఇందులో కొంతమంది సక్సెస్ అవుతుంటే... మరికొంతమంది సక్సెస్ అయ్యేందుకు చాలా కష్టపడుతున్నారు. ఇక మరికొంతమంది హీరోయిన్లు... అతి తక్కువ కాలంలోనే పెద్ద సినిమాల్లో ఛాన్సులు కొట్టేస్తున్నారు. అయితే ఇలాంటి కేటగిరీలోకి హీరోయిన్ రుక్మిణి వసంత్ కూడా వస్తారు. కర్ణాటక కు చెందిన రుక్మిణి వసంత్ 2019 నుంచి ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. కన్నడ, తమిళ్, తెలుగు లో ఇప్పటికే సినిమాలు చేశారు ఈ అందాల తార. తెలుగులో అప్పుడో ఇప్పుడు ఎప్పుడో అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న డ్రాగన్ సినిమాలో కూడా ఆమెకు ఛాన్స్ దక్కింది. అయితే... ఈ రుక్మిణికి కాంతార చాప్టర్ 1 లో కూడా ఛాన్స్ దక్కింది. ఈ సినిమా దసరా కానుగా రిలీజ్ కానుంది. ఇలాంటి నేపథ్యంలో కాంతార చాప్టర్ 1 మూవీ ట్రైలర్ రిలీజ్ అయింది. ఇందులో హీరో రిషబ్ శెట్టితో రొమాన్స్ కూడా చేసిన విజువల్స్ వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఆమె గ్లామరస్ ఫోటోలు కూడా ట్రెండింగ్ లోకి వచ్చాయి. ఇక ఈ ఫోటోలు చూసిన సినీ ప్రియులు స్పందిస్తున్నారు. రుక్మిణి వసంత్ కూడా రష్మిక, సాయి పల్లవి లాగే మరో 10 ఏళ్లు ఇండస్ట్రీని షేక్ చేయడం గ్యారెంటీ అంటున్నారు. డ్రాగన్ సినిమా రిలీజ్ అయితే తెలుగులో నెంబర్ 1 హీరోయిన్ అయ్యే ఛాన్స్ ఉన్నట్లు చెబుతున్నారు.




# 71వ జాతీయ అవార్డుల వేడుక..

### రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

**టాకీస్:** దేశ రాజధాని ఢిల్లీ జాతీయ చలనచిత్ర అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందజేశారు. 2023 ఏడాది గానూ ఈ అవార్డులను



అందించారు. ఉత్తమ నటులుగా షారూఖ్ ఖన్, విక్రాంత్ మాస్సే.. జాతీయ ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ అవార్డులు అందుకున్నారు. జాతీయ ఉత్తమ చిత్రంగా 12 ఫెయిల్ చిత్రానికి ఘనత దక్కింది. మంగళవారం ఢిల్లీలో 71 వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రదానోత్సవం గ్రాండ్‌గా నిర్వహించారు.

**తెలుగులో జాతీయ అవార్డు గ్రహీతలు వీళ్లే..**

తెలుగులో ఉత్తమ చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరికి జాతీయ అవార్డ్ దక్కింది. బెస్ట్ యాక్షన్ డైరెక్షన్,స్టంట్ కొరియోగ్రఫీ అవార్డ్ హనుమాన్ సొంతం చేసుకుంది. బలగం చిత్రంలోని ఊరు పల్లెటూరు పాట అనే పాటకు బెస్ట్ లిరిక్స్ విభాగంలో అవార్డ్ సొంతమైంది. బెస్ట్ స్క్రీన్ ప్లే బేబీ సినిమా( సాయి రాజేష్ నీలం), బెస్ట్ మెయిల్ ప్లే బ్యాక్ సింగర్ రోహిత్‌ను జాతీయ అవార్డులు వరించాయి. బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి (గాంధీ తాత చెట్టు) జాతీయ అవార్డ్ అందుకుంది. ఉత్తమ్ చిత్రం యానిమేషన్ విజువల్స్,గేమింగ్ అండ్ కామిక్ విభాగంలో హనుమాన్ నేషనల్ అవార్డ్‌ను సాధించింది.

# మోడీ స్ఫూర్తిదాయక నేత: జాన్వీకపూర్

టాకీస్: భారత ప్రధాని మోదీ నిర్ణయాలు అందరికీ స్ఫూర్తినిస్తాయని బాలీవుడ్ నటి జాన్వీకపూర్ అన్నారు. ముంబయిలో జరిగిన 'మేరా దేశ్ పహ్లే: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ శ్రీ నరేంద్రమోదీ' ప్రీమియర్‌లో పాల్గొన్న జాన్వీకపూర్.. మోదీపై అభిమానాన్ని చాటుకున్నారు. ఆ ఈవెంట్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ కార్యక్రమానికి హాజరుకావడం నాకు చాలా ఆనందంగా ఉంది. దేశంలోని వారందరికీ మోదీ కథ గురించి తెలుసు. కానీ, ఒక నటిగా ఈ ఈవెంట్‌కు రావడం, ఆయన కథ వినడం నాకు చాలా సంతోషంగా ఉంది. మోదీ జీవితం, ఆయన దేశం కోసం తీసుకొనే నిర్ణయాలు అన్నీ ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన చేసే ప్రతి పని అందరికీ స్ఫూర్తినిస్తుంది' అని జాన్వీకపూర్ అన్నారు. 'మేరా దేశ్ పహ్లే: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ శ్రీ నరేంద్రమోదీ' విషయానికొస్తే.. ప్రముఖ రచయిత మనోజ్ ముంతాషిర్ ఈ కాన్సర్ట్‌ను ఏర్పాటుచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన బాల్యం నుంచి జాతీయనాయకుడిగా ఎదిగిన తీరును పాట రూపంలో అందించారు. ముంబయిలో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై సందడి చేశారు. మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా ఈ కాన్సర్ట్‌ను నిర్వహించారు.



# పవన్, చిరు కాంబోలో మూవీ

### రామ్‌గోపాల్ వర్మ ఆసక్తికర పోస్ట్

టాకీస్: దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన తాజా పోస్ట్‌తో మెగా అభిమానులను ఆకర్షించారు. చిరంజీవి నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' విడుదలై సెప్టెంబర్ 22కు 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు పవన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆ పోస్ట్‌ను రీషేర్ చేసిన రామ్‌గోపాల్ వర్మ.. చిరు, పవన్ కలిసి సినిమా తీయాలని



కోరారు.మీరిద్దరూ కలిసి ఒక సినిమా చేస్తే అది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ మెగా పవర్ జోష్ నింపినట్లు అవుతుంది. ఆ చిత్రం ఈ శతాబ్దంలోనే మెగా పవర్ సినిమా అవుతుందని రామ్‌గోపాల్ వర్మ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఒకవేళ ఇదే జరిగితే ఈ సినిమాకు ఎవరు దర్శకత్వం వహిస్తే బాగుంటుందని నెటిజన్లు వారి అభిప్రాయాలను కామెంట్స్ చేస్తున్నారు. ఇక చిరు నటించిన తొలి సినిమా విడుదలై 47 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అన్నయ్యపై పవన్ కల్యాణ్ అభిమానం చాటారు. నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. చిరంజీవి పుట్టకతోనే యోధుడని పేర్కొన్నారు. ఆయనకు రిటైర్మెంట్ ఉండదని ప్రశంసలు కురిపించారు. పవన్ పోస్ట్‌కు స్పందించిన చిరు.. ఆ మాటలు తనను పాత రోజులకు తీసుకెళ్లాయని తెలిపారు.

# మిరాయ్‌లో వైబ్ ఉంది పాట జోడింపు

**టాకీస్:** యంగ్ హీరో తేజ సజ్జ హీరోగా, రితికా నాయక్ హీరోయిన్‌గా నటించిన సైన్స్-ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ 'మిరాయ్' సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, విడుదలైన అన్ని చోట్ల మంచి కలెక్షన్లు రాబడుతూ, తేజ సజ్జ కెరీర్‌లో మరో హైయెస్ట్ గ్రాసర్ గా నిలిచింది. అయితే, సినిమా విడుదల రోజున ప్రేక్షకులు ఓ విషయంలో తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ప్రీ రిలీజ్ ప్రమోషన్లలో సెన్సేషన్‌గా మారిన 'వైబ్ ఉంది' అనే పాట, చిత్రంలో ఎక్కడా కనిపించకపోవడం ఆ నిరాశకు కారణమైంది. యూత్‌లో దూసుకుపోయిన ఈ పాటను థియేటర్లో చూసేందుకు వచ్చినవారికి అది కనిపించకపోవడం కొంత డిజప్పాయింట్ చేసింది. చివరికి ప్రేక్షకుల డిమాండ్‌కు తలొగ్గిన చిత్రబృందం, సెప్టెంబర్ 23 నుండి 'వైబ్ ఉంది' పాటను సినిమాలో ప్రత్యేకంగా కలిపి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ పాటను స్క్రీన్ మీద చూడాలని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది గుడ్ న్యూస్ అని చెప్పొచ్చు. ఈ పాట థియేటర్లలో ప్రదర్శించబోతున్నట్టు తెలిసిన వెంటనే సోషల్ మీడియాలో ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మూవీ ఇప్పటికే వంద కోట్ల వసూళ్లు క్రాస్ చేయగా, రానున్న రోజులలో మరిన్ని రికారులు సాధించనుందని అంటునారు.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.